ప్రజాశక్తి

శుక్రవారం 8 సెప్టెంబర్ 2023

ఒంటరి ఏనుగు హల్‌చల్

ప్రజాశక్తి - కురుపాం

కురుపాం పరిసర ప్రాంతాల్లో గురువారం ఉదయం ఒంటరి ఏనుగు సంచరిస్తూ హల్‌చల్ చేస్తున్నట్టు ఎలిఫెంట్ మోనిటరింగ్ ఆఫీసర్ మణికంఠేష్ తెలిపారు. కొమరాడ మండలం అర్తం గ్రామ పరిసర ప్రాంతాల్లో సంచరించి బస్సు అద్దాలు పగలగొట్టిన హరి అనే ఏనుగు బుధవారం రాత్రి సుమారు 50 కిలోమీటర్ల మేరకు నడిచి కురుపాం పరిసరాలకు చేరుకుంది. మంత్రజోల, పెల్లి వలస గ్రామ సమీపంలో సంచరిస్తోంది. ఆ పరిసర గ్రామాల ప్రజలు బయటకు వెళ్లేటప్పుడు జాగ్రత్తలు పాటించాలని ఆయన సూచించారు.

కురుపాం పరిసర ప్రాంతాల్లో సంచరిస్తున్న ఒంటరి ఏనుగు

పోటెత్తిన వరద

జిల్లాలో రెండు రోజులపాటు భారీ వర్షాలు కురిశాయి. వరదనీరు పోటెత్తడంతో నదులు, వాగులు, గెడ్డలు ఉప్పొంగి ప్రవహించాయి. తోటపల్లి, పెద్దగెడ్డ, వెంగళరాయసాగర్ ప్రాజెక్టులు నిండుకుండల్లా నీటితో తొణికిసలాడుతున్నాయి. నదులు, గెడ్డలు ఉధృతంగా ప్రవహించడంతో పలు గ్రామాలకు రాకపోకలు స్తంభించాయి. పార్వతీపురం పట్టణ శివారు కాలనీలు జలదిగ్బంధనంలో చిక్కుకున్నాయి. వీరఘట్టం మండలం నడుకూరులో, పార్వతీపురం మండలంలో జంఝావతి కాలువకు గండి పడటంతో పంట పొలాలు ముంపు బారిన పడ్డాయి.

నడుకూరు గ్రామ సమీపంలో నీటి మునిగిన పంట పొలాలు

వరదనీటితో కళకళలాడుతున్న పెద్దగెడ్డ రిజర్వాయర్

నిండుకుండలా పెద్దగెడ్డ

పాచిపెంట : మండలంలోని పెద్దగెడ్డ జలశయం గత వారం రోజులుగా కురుస్తున్న వర్షాలకు నిండుకుండను తలపిస్తోంది. జలాశయం పూర్తి నీటిమట్టం 213.8 మీటర్లు కాగా, ప్రస్తుత నీటిమట్టం 212 మీటర్లు ఉంది. ప్రస్తుతం వర్షాల కారణంగా జలాశయంలోకి 170 క్యూసెక్కుల నీరు చేరుతోంది. దీంతో ప్రధాన కాలువ ద్వారా పంట పొలాలకు 130 క్యూసెక్కుల నీరు విడిచి పెడుతున్నట్లు డిఇ పి.కనకారావు తెలిపారు.

జంఝావతి కాలువకు గండి

ప్రజాశక్తి -పార్వతీపురం రూరల్

రెండు రోజులుగా కురుస్తున్న భారీవర్షాలకు పార్వతీపురం మండలం అడ్డాపుశీల గ్రామం మీదుగా గరుగుబిల్లి వెళ్తున్న జంఝావతి కాలువకు గురువారం ఉదయం గండి పడింది. ఆ కాలువ గట్టు తెగడంతో పార్వతీపురం-పాలకొండ రోడ్డుపై వరద నీరు ప్రవహించింది. దీంతో గ్రామంలో రాకపోకలు స్తంభించాయి. సంబంధిత అధికారులు స్పందించి చర్యలు తీసుకోవాలని గ్రామస్తులు కోరుతున్నారు.

రోడ్డుపైనుంచి ప్రవహిస్తున్న సాగిగెడ్డ నీరు

ఉప్పొంగిన సాకిగెడ్డ

భారీవర్షాల కారణంగా మండలంలోని పుట్టూరు - లచ్చిరాజుపేట గ్రామాల మధ్య ఉన్న సాకిగెడ్డ ఉప్పొంగి ప్రవహిస్తోంది. దీంతో గురువారం సుమారు 45 గ్రామాలకు రాకపోకలు నిలిచిపోయాయి. గతంలో ఇదే సాగి గడ్డ పొంగి వేల ఎకరాల పంట పొలాలు దెబ్బతిన్నాయి. ఇప్పుడు కూడా అదే పరిస్థితితో లచ్చిరాజుపేట సెంటర్ నుంచి భారీగా వరద నీరు ప్రవహిస్తూ ఉండడంతో రైతులు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు.

తోటపల్లికి భారీగా వరదనీరు

గరుగుబిల్లి : ఎడతెరపి లేకుండా కురుస్తున్న వర్షాల వల్ల వాగులు, వంకలు పొంగి పొర్లుతున్నాయి. దీంతో తోటపల్లి రిజర్వాయరులోకి భారీగా వరదనీరు వచ్చి చేరుతోందని ఎఇ శ్రీనివాసరావు తెలిపారు. రిజర్వాయరు సామర్థ్యం 2.534 టిఎంసిలు కాగా, గురువారం సాయంత్రానికి 2.278 టిఎంసిలకు చేరినట్లు చెప్పారు. రిజర్వాయరు పూర్తి నీటిమట్టం 105 మీటర్లకు గాను ప్రస్తుతం 104.62 మీటర్లకు చేరినట్లు వెల్లడించారు. ఇన్‌ఫ్లో 5845 క్యూసెక్కులు కాగా, అవుట్ ఫ్లో 4213 క్యూసెక్కులుగా ఉందని తెలిపారు. నాగావళి నది ద్వారా 2943 క్యూసెక్కుల నీరు విడుదల చేస్తున్నట్లు చెప్పారు. ఎడమ ప్రధాన కాలువ ద్వారా 280 క్యూసెక్కులు, పాత కుడి ప్రధాన కాలువ ద్వారా 90, కొత్త కుడి ప్రధాన కాలువ ద్వారా 900 క్యూసెక్కుల నీటిని విడుదల చేస్తున్నట్లు వివరించారు. దిగువ ప్రాంతం ప్రజలు జాగ్రత్తగా ఉండాలని కోరారు.

తోటపల్లి ప్రాజెక్టు నుంచి విడుదల చేస్తున్న నీరు

100 ఎకరాల్లో పంట మునక

- విస్తారంగా కురిసిన వర్షాలే కారణం
- పొంగిపొర్లుతున్న వాగులు, గెడ్డలు

ప్రజాశక్తి-వీరఘట్టం

మండలంలో రెండు రోజులుగా విస్తారంగా వర్షాలు కురిశాయి. దీంతో వాగులు, వంకలు పొంగిపొర్లుతున్నాయి. నడుకూరు గ్రామ సమీపంలో 100 ఎకరాల్లో వరిపంట నీటమునిగింది. మొన్నటివరకు సాగునీటి కోసం ఎన్నో అవస్థలు పడి మోటార్ల సహాయంతో పంటలు సాగు చేశారు. రెండు రోజులుగా వర్షాల కారణంగా సీతమ్మ సాగరం చెరువు నీరు పంట పొలాలపై ప్రవహించడంతో రైతులు ఆందోళన చెందుతున్నారు. మరికొన్ని రోజులు ఇదే పరిస్థితి కొనసాగితే, పంటలపై ఆశలు వదులుకోవాల్సి పరిస్థితి ఏర్పడుతుందని రైతులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు.

ఉధృతంగా వట్టిగెడ్డ

వీరఘట్టం మండలంతోపాటు వివిధ ప్రాంతాల్లో విస్తారంగా వర్షాలు పడటంతో పైనుంచి వచ్చిన వరదల కారణంగా వట్టిగడ్డలో నీటి ప్రవాహం అమాంతంగా పెరిగింది. వట్టిగడ్డకు సమీపంలో నివశిస్తున్న వారు భయాందోళనకు గురవుతున్నారు. ఇటీవల కూడా వర్షాల కారణంగా వట్టిగడ్డలో నీటి ప్రవాహం క్రమేపీ పెరిగిపోవడంతో గృహాల్లోకి చేరింది. అప్పట్లో స్థానికులు ఎగువ ప్రాంతానికి వచ్చి తలదాచుకోవాల్సిన పరిస్థితి ఏర్పడింది. ప్రస్తుతం ఆ పరిస్థితి రాకముందే అధికారులు వట్టిగడ్డ పరివాహక ప్రాంతాలను సందర్శించి, ప్రజలకు ధైర్యం చెప్పాల్సిన అవసరం ఎంతైనా ఉంది.

వీరఘట్టం.. వట్టిగెడ్డలో ఉధృతంగా ప్రవహిస్తున్న వరద నీరు

ముంపు ప్రాంతాల్లో ఎమ్మెల్యే పర్యటన

ముంపు ప్రాంతంలో పర్యటిస్తున్న ఎమ్మెల్యే జోగారావు

ప్రజాశక్తి-పార్వతీపురం టౌన్

పార్వతీపురం ప్రాంతంలో బుధవారం సాయంత్రం ఏకధాటిగా 3 గంటలపాటు కురిసిన భారీ వర్షానికి పట్టణంలో ఉన్న వరహాలగెడ్డలో వరద నీరు పోటెత్తింది. పట్టణ ప్రధాన రహదారితో పాటు శివారులోని పలు కాలనీల్లో వీధులు జలమయం అయ్యాయి. గురువారం ఉదయం ఎమ్మెల్యే అలజంగి జోగారావు ముంపు ప్రాంతాలైన చైతన్య పాఠశాల పరిసరాలు, 20వ వార్డులో ఉన్న జనశక్తి కాలనీ, సుందర నారాయణ పురం కాలనీ, సౌందర్య థియేటర్ వెనుక ఉన్న రోడ్డు, నెల్లిచెరువు గట్టు, బైపాస్ కాలనీల్లో మున్సిపల్ కమిషనర్ జె.రామ అప్పలనాయుడు, అధికారులతో కలిసి సందర్శించారు. జెసిబిలను ఉపయోగించి సహాయక చర్యలు చేపట్టారు. నీట మునిగిన ఇళ్లలోని ప్రజలకు మంచినీరు, భోజనం ఏర్పాటు చేయించారు. స్థానిక పరిస్థితులపై ఎప్పటికప్పుడు జిల్లా ఉన్నతాధికారులతో మాట్లాడి అవసరమైన చోట ప్రభుత్వం తరుపున సహాయక చర్యలు అందించేలా చూడాలని సూచించారు. ముంపునకు గురైన నివాసాలను గుర్తించి, కుటుంబానికి రూ.2 వేల నగదుతోపాటు నిత్యావసర సరుకులను రెవెన్యూ అధికారులకు కలెక్టర్ సూచించినట్లు తెలిపారు. బాధితులకు బెలగాం చర్చి వీధిలో ఉన్న డివివిఎం ప్రభుత్వ పాఠశాలలో పునరావాసాన్ని కల్పించారు. అనంతరం ఎమ్మెల్యే జనశక్తి కాలనీ, సుందర నారాయణ పురం కాలనీ వాసులతో మాట్లాడుతూ వరహాల గెడ్డకు రక్షణగోడ నిర్మాణం చేపట్టేందుకు త్వరలో నిధులు మంజూరు చేయిస్తానని హామీ ఇచ్చారు. కార్యక్రమంలో వైసిపి ఫ్లోర్ లీడర్ మంత్రి రవికుమార్, శానిటరీ ఇన్‌స్పెక్టర్ మురళీ, తదితరులు పాల్గొన్నారు.

వరద నీరు మళ్లించేందుకు చర్యలు

జిల్లా కేంద్రంలో బుధవారం సాయంత్రం కురిసిన భారీ వర్షానికి ముంపునకు గురైన ప్రాంతాల్లో గురువారం నీటిమళ్లింపు చర్యలు చేపట్టారు. మున్సిపల్ కమిషనర్ జె.రామ అప్పలనాయుడు, మున్సిపల్ ఇంజినీరింగ్, రెవెన్యూ, ప్రజారోగ్య విభాగం అధికారులతో కలిసి మూడు జెసిబిలను ఉపయోగించి వరద నీరు మళ్లించేందుకు సహాయక చర్యలు చేపట్టారు. వరద నీరు నిల్వ ఉన్న ప్రదేశాలలో ఇంజిన్ల సహాయంతో తోడించే ప్రక్రియ చేపట్టారు. దోమలు విజృంభించకుండా ఉండేందుకు పారిశుధ్య నిర్వహణ పనులు చేపట్టారు. ఈ పనుల్లో ఎఇ జి.ఆనంద్, టిపిఒ పి.కనకారావు, రెవెన్యూ ఇన్‌స్పెక్టర్లు పి.నారాయణరావు, జి.వినయ్‌కుమార్, ప్రజారోగ్య అధికారి మురళి, మున్సిపల్ సిబ్బంది పాల్గొన్నారు.

తొలగించిన ఓట్లన్నీ పరిశీలిస్తాం

కలెక్టర్ నిశాంత్‌కుమార్

ప్రజాశక్తి-పార్వతీపురం

జిల్లాలో తొలగించిన ప్రతి ఓటునూ పరిశీలిస్తున్నామని కలెక్టర్ నిశాంత్ కుమార్ తెలిపారు. అన్ని రాజకీయ పార్టీల ప్రతినిధులతో ఓటరు పునశ్చరణ కార్యక్రమంపై కలెక్టర్ కార్యాలయంలో గురువారం సమావేశం జరిగింది. ఈ సమావేశంలో కలెక్టర్ మాట్లాడుతూ తొలగించిన ప్రతి ఓటు పరిశీలించుటకు ప్రత్యేక అధికారులను నియమించామని చెప్పారు. జిల్లా కలెక్టర్ స్థాయిలో స్వయంగా పరిశీలిస్తున్నట్లు ఆయన అన్నారు. జిల్లాలో ఇంటింటి ఓటరు విచారణ 0.48 శాతం మాత్రమే పెండింగ్ ఉందన్నారు. పాలకొండ నియోజకవర్గంలో 1,99,111 ఓటర్లు ఉండగా 926 మందిని, కురుపాం నియోజకవర్గంలో 1,87,120 ఓటర్లు ఉండగా, 518 మందిని, పార్వతీపురం నియోజకవర్గంలో 1,87,815 ఓటర్లు ఉండగా 69 మందిని పరిశీలించాల్సి ఉందని తెలిపారు. సాలూరు నియోజకవర్గంలో మొత్తం ఓటర్లు 1,99,295 ఓటర్లు ఉండగా 2164 మందిని పరిశీలించాల్సి ఉందని తెలిపారు.

ఇంటింటి విచారణలో 4622 మంది లేనట్లు గుర్తించామన్నారు. ఇందులో పాలకొండ నియోజకవర్గంలో 1747 మంది, కురుపాం నియోజకవర్గంలో 446 మంది, పార్వతీపురం నియోజకవర్గంలో 1131 మంది, సాలూరు నియోజకవర్గంలో 1298 మంది ఉన్నారని ఆయన చెప్పారు. 3213 మంది శాశ్వతంగా ఆయా గ్రామాల నుండి వెళ్లిపోయిన ఓటర్లను గుర్తించామన్నారు. అందులో పాలకొండ నియోజకవర్గంలో 1722 మంది, కురుపాం నియోజకవర్గంలో 244 మంది, పార్వతీపురం నియోజకవర్గంలో 836 మంది, సాలూరు నియోజకవర్గంలో 411 మంది ఉన్నారని వివరించారు. 13,998 మంది ఓటర్లు మృతి చెందినట్లు గుర్తించామన్నారు. 1862 నకిలీ ఓట్లు ఉన్నట్లు గుర్తించామని చెప్పారు. అందులో పాలకొండ నియోజకవర్గంలో 1051 మంది, కురుపాం నియోజకవర్గంలో 194 మంది, పార్వతీపురం నియోజకవర్గంలో 322 మంది, సాలూరు నియోజకవర్గంలో 295 మంది ఉన్నారని వెల్లడించారు. 23,826 ఓటర్లకు చేర్పులు, మార్పులు చేసినట్లు తెలిపారు.

ఓటరు జాబితాలో తప్పులు గమనిస్తే దరఖాస్తు చేయవచ్చని, ఈ మేరకు ఎన్నికల కమిషన్ ఆదేశాలు జారీ చేసిందని ఆయన చెప్పారు. ఈ సమావేశంలో జిల్లా రెవెన్యూ అధికారి జె.వెంకటరావు, బిజెపి ప్రతినిధి పారిశర్ల అప్పారావు, టిడిపి ప్రతినిధి బి.డి.చంద్రమౌళి , వైసిపి ప్రతినిధి బి.శ్రీనివాసరావు, జనసేన పార్టీ ప్రతినిధి పైల శ్రీనివాసరావు పాల్గొన్నారు.

సమావేశంలో మాట్లాడుతున్న కలెక్టర్ నిశాంత్‌కుమార్

విజయనగరం వైద్య కళాశాల ప్రారంభోత్సవానికి

ముఖ్యమంత్రి రాక

14 లేదా 15న పర్యటన : డిప్యూటీ స్పీకర్ కోలగట్ల

ప్రజాశక్తి-విజయనగరంటౌన్

విజయనగరం జిల్లా ప్రజల చిరకాల కోరికైన ప్రభుత్వ వైద్య కళాశాల ప్రారంభోత్సవానికి రాష్ట్ర ముఖ్యమంత్రి వైఎస్ జగన్ మోహన్ రెడ్డి రానున్నారని డిప్యూటీ స్పీకర్ కోలగట్ల వీరభద్ర స్వామి తెలిపారు. ఈనెల 14 లేదా 15వ తేదీన సిఎం పర్యటన ఉంటుందని వెల్లడించారు. ఇందుకు సంబంధించిన ఏర్పాట్లను చేస్తున్నట్లు వివరించారు. సిఎం పర్యటన నేపథ్యంలో కార్యక్రమాన్ని విజయవంతం చేసేందుకు గురువారం విజయనగరంలోని తన నివాసం వద్ద ముఖ్య నాయకులతో ఆయన సమావేశమయ్యారు. అనంతరం మీడియా సమావేశంలో మాట్లాడారు. వెనుకబడిన విజయనగరం జిల్లాను అన్ని రంగాల్లోనూ ముందుకు తీసుకు వెళ్లాలన్న లక్ష్యంతో ముఖ్యమంత్రి జగన్ ప్రత్యేక దృష్టి సారించారని తెలిపారు. అందులో భాగంగానే కొద్ది రోజుల క్రితం భోగాపురం వద్ద అంతర్జాతీయ విమానాశ్రయానికి శంకుస్థాపన చేశారని, ఇటీవలే ఉమ్మడి విజయనగరం జిల్లా పరిధిలో గిరిజన విశ్వవిద్యాలయానికి శ్రీకారం చుట్టారని చెప్పారు. వీటితోపాటు జిల్లాకు ప్రభుత్వ వైద్య కళాశాలను మంజూరు చేయడమే కాక, నేడు తరగతులనూ ప్రారంభించుకున్నామని వివరించారు. విజయనగరం నియోజకవర్గ పరిధిలోని గాజులరేగ వద్ద నిర్మిస్తున్న వైద్య కళాశాలను ప్రారంభించేందుకు ముఖ్యమంత్రి రానున్నారని తెలిపారు. ఈ సందర్భంగా కళాశాల సమీపంలోనే బహిరంగ సభ నిర్వహించేందుకు ఏర్పాట్లు చేస్తున్నామన్నారు. తమ ప్రభుత్వం విద్య, వైద్యానికి ఈ ప్రభుత్వం అధిక ప్రాధాన్యమిస్తోందన్నారు. గిరిజన వర్సిటీ, జెఎన్‌టియు స్థాయి పెంపు, వైద్య కళాశాల మంజూరు ఇందుకు నిదర్శనమన్నారు. ప్రభుత్వ వైద్య కళాశాల ప్రారంభమైతే ఇక్కడే అత్యాధునిక వైద్య సేవలు అందుతాయని, స్పెషలిస్ట్ వైద్యులు అందుబాటులో ఉంటారని తెలిపారు. విజయనగరం నియోజకవర్గానికి గతంలో జగనన్న వసతి దీవెన పథకం ప్రారంభోత్సవం సందర్భంలోనూ, గుంకలాంలో జగనన్న లేఅవుట్ ప్రారంభానికి ముఖ్యమంత్రి విచ్చేశారని.. ప్రస్తుతం మూడోసారి రానున్నారని తెలిపారు. ఆయన పర్యటనను విజయవంతం చేసేందుకు పార్టీ కేడర్‌ను సమాయత్తం చేస్తున్నామని కోలగట్ల తెలిపారు.

15న పార్వతీపురంలో మినీ జాబ్‌మేళా

ప్రజాశక్తి-పార్వతీపురం

ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర నైపుణ్యాభివృద్ధి సంస్థ ఆధ్వర్యంలో ఉపాధి కల్పనలో భాగంగా ఈ నెల 15న జాబ్‌మేళా నిర్వహిస్తున్నట్లు జిల్లా నైపుణ్య అభివృద్ధి అధికారి యు.సాయికుమార్ తెలిపారు. ఈ మేరకు గురువారం ఒక ప్రకటన విడుదల చేశారు. డిప్లొమో, డిగ్రీ, పీజీ అర్హత కలిగి, 18 నుండి 35 ఏళ్ల వయస్సు కలిగిన నిరుద్యోగ యువతీ, యువకులకు 15న ఉదయం 9 గంటల నుండి పార్వతీపురం ప్రభుత్వ జూనియర్ కాలేజిలో మినీ జాబ్ మేళా నిర్వహిస్తున్నట్లు చెప్పారు. జాబ్‌మేళాకు టెక్ మహీంద్రా, ఆర్వోన సాఫ్ట్‌వేర్ సొల్యూషన్స్ ప్రతినిధులు హాజరవుతున్నారని తెలిపారు. అర్హత కలిగిన అభ్యర్థులను ఎంపిక చేస్తారని చెప్పారు. ఆసక్తి కలిగిన నిరుద్యోగ యువతీ, యువకులు తమ వివరాలను www.apssdc.in వెబ్‌సైట్‌లో తప్పనిసరిగా నమోదు చేసుకోవాలని కోరారు. రిఫరెన్స్ నెంబర్‌తో పాటుగా బయోడేటా, ఆధార్ కార్డు, విద్యార్హత సర్టిఫికెట్లు ఒరిజినల్, జెరాక్స్, ఒక పాస్‌పోర్టు సైజ్ ఫొటోతో ఉదయం 9 గంటలకు ప్రభుత్వ జూనియర్ కళాశాలకు రావాలని కోరారు. వివరాలకు 9182398325, 7997299739 ఫోన్ నంబర్లకు సంప్రదించాలని విజ్ఞప్తి చేశారు.

సమావేశంలో మాట్లాడుతున్న డిఆర్‌ఒ వెంకటరావు

జగనన్నకు చెబుదాంలో

సంతృప్తికర పరిష్కారమే ధ్యేయం

జెసి గోవిందరావు

ప్రజాశక్తి-పార్వతీ పురం

జగనన్నకు చెబుదాం కార్యక్రమం ద్వారా సంతృప్తికర పరిష్కారమే ధ్యేయంగా పనిచేయాలని జాయింట్ కలెక్టర్ ఆర్.గోవింద రావు అన్నారు. జగనన్నకు చెబుదాంపై జిల్లా స్థాయి కమిటీ సమావేశం కలెక్టర్ కార్యాలయంలో గురువారం జరిగింది. జగనన్నకు చెబుదాం కార్యక్రమాన్ని ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా చేపడుతోందని అన్నారు. ప్రజల సమస్యల పరిష్కారం కోసం అధికారులు కృషిచేయాలన్నారు. జిల్లా స్థాయిలో సివిల్ వివాదాల కోసం అందే సమస్యలను మండల స్థాయి కమిటీకి సిఫార్సు చేసి నిర్దేశిత సమయంలో పరిష్కరించేందుకు చర్యలు తీసుకోవాలన్నారు. జిల్లా, మండల స్థాయి సమన్వయ కమిటీలు క్రమం తప్పకుండా సమావేశమై తదనుగుణంగా అవసరమైన చర్యలు తీసుకొంటాయని చెప్పారు. కార్యక్రమంలో డిఆర్‌ఒ జె.వెంకటరావు, డిపిఒ బి.సత్యనారాయణ, జిల్లా రిజిస్ట్రార్ ఎం.ఎస్.కె.పూర్ణచంద్, పార్వతీపురం టౌన్ సిఐ పివివిఎస్ఎన్ కృష్ణారావు, డిసిఆర్‌బి ఎస్ఐ డి.రవీంద్ర రాజు, మున్సిపల్ ఎఇ జె.ఆనంద్ పాల్గొన్నారు.

ఈ సమావేశమైనా సక్రమంగా సాగేనా?

ప్రజాశక్తి-కొమరాడ

మూడు నెలలకు ఒకసారి మండల సర్వసభ్య సమావేశాన్ని ఎంపిడిఒ కార్యాలయంలో నిర్వహిస్తున్నారు. సమావేశానికి సంబంధిత అధికారులు పూర్తిస్థాయిలో హాజరు కాకపోవడంతో ప్రతిసారీ మమా అనిపిస్తున్నారని మండల ప్రజల నుంచి విమర్శలు వినిపిస్తున్నాయి. శుక్రవారం మండల సర్వసభ్య సమావేశం నిర్వహిస్తున్నట్లు ఎంపిడిఒ మల్లికార్జునరావు తెలిపారు. మూడు నెలలకు ఒకసారి మండలంలో జరిగిన అభివృద్ధి పనులు, చేయాల్సిన పనులు, సమస్యలపై చర్చించేందుకు సర్వసభ్య సమావేశం నిర్వహిస్తామని తెలిపారు. ఈ సమావేశం ఎంపిపి శెట్టి శ్యామల అధ్యక్షతన జరుగుతున్నట్లు తెలిపారు. గత నాలుగు సమావేశాలకు పూర్తిస్థాయిలో అధికారులు హాజరుకాకపోవడంతో కనీసం అభివృద్ధి, సమస్యలపై చర్చించినా ఫలితం దక్కడం లేదు. శుక్రవారం జరగనున్న సర్వసభ్య సమావేశానికి పూర్తిస్థాయిలో అధికారులు నివేదికతో వస్తారా? రారా? అన్నది ప్రశ్నార్థకంగా మారింది. ప్రతి సర్వసభ్య సమావేశం తూతూ మాత్రంగా నిర్వహిస్తున్నారు తప్ప ఎటువంటి తీర్మానాలు చేసే పరిస్థితి కనిపించడం లేదు. సమావేశాల్లో అధికారపార్టీ ప్రజాప్రతినిధులే సమస్యలపై గళమెత్తుతున్నా కనీసం అధికారులు పట్టించుకునే పరిస్థితి లేకపోయింది. మండలంలో ప్రజలు ఎదుర్కొంటున్న అనేక సమస్యలకు సంబంధించి పూర్తిస్థాయిలో అధికారులు హాజరుకాకపోవడంతో ఎవరిని ప్రశ్నించాలో తెలియని పరిస్థితిలో ప్రజాప్రతినిధులు ఉన్నారు. ఈ సమావేశానికైనా పూర్తిస్థాయిలో అన్ని శాఖల అధికారులు హాజరైతే మండలంలో ఉన్న సమస్యలు పరిష్కారానికి చర్యలు చేపట్టే విధంగా కృషి చేయాలని మండల ప్రజలు కోరుతున్నారు.

జ్యూట్ కార్మికులకు న్యాయం చేయాలి

జెఎసి ఆధ్వర్యాన భారీ ర్యాలీ, ధర్నా

ప్రజాశక్తి-సాలూరు

మండలంలోని జీగిరాం జ్యూట్ మిల్లు తెరిపించి కార్మికులకు న్యాయం చేయాలని గురువారం కార్మికులు జెఎసి ఆధ్వర్యాన పట్టణంలో జాతీయ రహదారిపై భారీ ర్యాలీ నిర్వహించారు. అనంతరం తహశీల్దార్ కార్యాలయం వద్ద ధర్నా చేపట్టారు. జెఎసి నాయకులు పి.శ్రీనివాసరావు అధ్యక్షతన జరిగిన కార్యక్రమంలో సిపిఎం మండల కార్యదర్శి ఎం.శ్రీనివాసరావు మాట్లాడుతూ 15 నెలలుగా జ్యూట్‌మిల్లు మూతపడ్డంతో కార్మికుల కుటుంబాలు రోడ్డున పడ్డాయని ఆవేదన వ్యక్తంచేశారు. 15 నెలలుగా కార్మిక కుటుంబాలు ఆకలితో అలమటిస్తున్నారని చెప్పారు. సమస్య పరిష్కారానికి ప్రభుత్వం ఏ విధమైన చర్యలూ చేపట్టలేదన్నారు. జిల్లా ప్రజాప్రతినిధులు గాని, అధికారులు గాని యాజమాన్యంతో కనీసం చర్చించలేదని ఆగ్రహం వ్యక్తంచేశారు. 17 రోజులుగా జ్యూట్ కార్మికులు మిల్లు ముందు రిలే నిరాహారదీక్షలు చేపడుతుంటే ప్రభుత్వం నిమ్మకు నీరెత్తినట్లు వ్యవహరించడం దారుణమన్నారు. సిపిఎం పాచిపెంట మండల కార్యదర్శి కోరాడ ఈశ్వరరావు మాట్లాడుతూ జ్యూట్‌మిల్లును మూసేయడంతో కార్మిక కుటుంబాలు తీవ్ర ఇబ్బందులు పడుతున్నాయని ఆవేదన వ్యక్తంచేశారు. జ్యూట్ మిల్లు తెరిపించకపోతే కార్మికుల ఆందోళన తీవ్రతరం చేయనున్నట్లు చెప్పారు.

జెఎసి నాయకులు రెడ్డి సింహాచలం మాట్లాడుతూ జ్యూట్‌మిల్లు యాజమాన్యం మిల్లుకి సంబంధించిన ఆస్తులను, విలువైన భూములను విక్రయించి సొమ్ము చేసుకునే ప్రయత్నంలో ఉందని ఆరోపించారు. స్థానిక మంత్రి రాజన్నదొర ఈ విషయంలో జోక్యం చేసుకొని సమస్య పరిష్కారానికి కృషి చేయాలని డిమాండ్ చేశారు.

అనంతరం డిప్యూటీ తహశీల్దార్ భానుప్రసాద్‌కి వినతిపత్రం అందజేశారు. ఈ కార్యక్రమంలో జెఎసి నాయకులు ఎస్.సింహాచలం, రెడ్డి సత్యం, గొల్లు సత్యనారాయణ, తిరుపతిరావు, అప్పలనాయుడు, కె.సూర్యనారాయణ, కర్రి అప్పారావు, కె.అప్పన్న, కేతిరెడ్డి అప్పలనాయుడు, సుధా, బలరాం పాల్గొన్నారు.

ర్యాలీ నిర్వహిస్తున్న కార్మికులు, జెఎసి నాయకులు

ర్యాలీ చేపడుతున్న కాంగ్రెస్ నాయకులు

జోడోయాత్రకు మద్దతుగా ర్యాలీ

ప్రజాశక్తి -పార్వతీపురంరూరల్

కాంగ్రెస్ పార్టీ యువనేత రాహుల్ గాంధీ చేపట్టిన భారత్ జోడో యాత్ర ఏడాది పూర్తి కావస్తున్న సందర్భంగా గురువారం పార్వతీపురం పట్టణంలో జిల్లా అధ్యక్షులు వజ్జుపర్తి శ్రీనివాస్ ఆధ్వర్యంలో ర్యాలీ నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ కేంద్రంలోని బిజెపి ప్రభుత్వం నిరంకుశంగా వ్యవహరిస్తోందన్నారు. అవినీతి, అక్రమాలు, అధిక ధరలపై ప్రధాని మౌనం వహిస్తున్నారని ఆగ్రహం వ్యక్తంచేశారు. ఈ కార్యక్రమంలో కాంగ్రెస్ నాయకులు తెడ్డు రామదాసు, జె.భాస్కరరావు, మరిచర్ల సత్యంనాయుడు, బలగా సూర్యనారాయణ, తాళ్ల బూరెలు, లబ్బ మురళి, రాఘవేంద్ర, లచ్చయ్య పాల్గొన్నారు.

పరిశ్రమలకు పవర్ కట్ ఎత్తివేత

ప్రజాశక్తి-విజయనగరం టౌన్

పరిశ్రమలకు విధించిన పవర్ కట్ నిర్ణయాన్ని తాత్కాలికంగా నిలుపుదల చేస్తున్నట్లు ఎపిఇపిడిసిఎల్ సూపరింటెండెంట్ ఇంజినీర్ ఎం.లక్ష్మణరావు గురువారం ఒక ప్రకటనలో తెలిపారు. ఈనెల 2న పరిశ్రమలకు విద్యుత్ కోతలు అమలు చేస్తున్నట్లు ఇచ్చిన ఆదేశాలను తాత్కాలికంగా నిలుపుదల చేశామన్నారు. పరిశ్రమలు యధా విధిగా విద్యుత్ ను వినియోగించుకోవచ్చు నని, విస్తారంగా వర్షాలు కురవడం వలన విద్యుత్ ఉత్పత్తి పెరగడం వల్ల పరిశ్రమలకు విధించిన పవర్ కట్ ను ఎత్తివేసినట్లు ఆయన తెలిపారు.

ఎంపికైన విద్యార్థులతో ప్రధానోపాధ్యాయులు, ఉపాధ్యాయ సిబ్బంది

రాష్ట్ర స్థాయి పోటీలకు నలుగురు ఎంపిక

ప్రజాశక్తి-వీరఘట్టం

మండలంలోని నీలానగరం జిల్లా పరిషత్తు ఉన్నత పాఠశాలకు చెందిన ఆర్.భవ్య, సుధీర్, బి.ధరణి, కె.భార్గవి రాష్ట్రస్థాయి షూటింగ్ బాల్ పోటీలకు ఎంపికైనట్లు ప్రధానోపాధ్యాయులు జి.రవి ప్రసాద్ తెలిపారు. ఈ నెల 9, 11 తేదీలలో నెల్లూరు జిల్లా కావలిలో జరిగే రాష్ట్ర స్థాయి పోటీలకు హాజరు కానున్నారని తెలిపారు. వ్యాయామ ఉపాధ్యాయులు ఎస్.వెంకటరమణకు ప్రత్యేక అభినందనలు తెలిపారు. విద్యార్థులు ఎంపిక పట్ల సర్పంచ్ వావిలపల్లి పురుషోత్తం నాయుడు, ఉపాధ్యాయ సిబ్బంది హర్షం వ్యక్తం చేశారు.

దశమంతపురంలో ఫ్యామిలీ డాక్టర్

ప్రజాశక్తి-వీరఘట్టం

మండలంలోని దశమంతపురం గ్రామంలో గురువారం ఫ్యామిలీ డాక్టర్ కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా స్థానిక ప్రాథమిక ఆరోగ్య కేంద్రం వైద్యాధికారి పి.ఉమామహేశ్వరి జ్వరపీడితులతోపాటు వివిధ రకాలైన రోగులకు తనిఖీలు నిర్వహించారు. మందులు పంపిణీ చేశారు. ఈ కార్యక్రమంలో సూపర్వైజర్ ఒ.శాంతికుమారి, ఎఎన్ఎం హేమ పాల్గొన్నారు.

రాంబాబును సన్మానిస్తున్న ఎంఇఒలు, ఉపాధ్యాయ సంఘాల నాయకులు

రాంబాబుకు ఘన సన్మానం

ప్రజాశక్తి-వీరఘట్టం

స్థానిక మండల విద్యాశాఖ కార్యాలయంలో గురువారం రాష్ట్రస్థాయి ఉత్తమ ఉపాధ్యాయ అవార్డు గ్రహీత సాకేటి రాంబాబును ఎంఇఒలు డి.గౌరినాయుడు, ఆర్.ఆనందరావు ఘనంగా సన్మానించారు. యుటిఎఫ్, ఎపిటిఎఫ్, పిఆర్టియు నాయకులు కూడా సన్మానించారు. కార్యక్రమంలో ఎం.పైడిరాజు, వి.అన్నాజీరావు, కె.విజయకుమార్, తదితరులు పాల్గొన్నారు.

రేగిడిలో పారిశుద్ధ్య కార్యక్రమాలు

ప్రజాశక్తి-గుమ్మలక్ష్మీపురం

వర్షాకాలంలో ప్రజలు రోగాల బారిన పడకుండా ఉండేందుకు ముందస్తు జాగ్రత్త చర్యల్లో భాగంగా పారిశుధ్య పనులకు ప్రాధాన్యత ఇస్తున్నట్లు బాలేసు సర్పంచ్ మండంగి కళావతి తెలిపారు. రేగిడి గ్రామంలో కాలువల్లో పూడికలు, పిచ్చి మొక్కలను గురువారం తొలగించారు. బోర్లు, బావుల వద్ద క్లోరినేషన్ చేయించారు. కార్యక్రమంలో పంచాయతీ కార్యదర్శి బిడ్డిక కృష్ణారావు, ఇంజినీరింగ్ అసిస్టెంట్ ప్రవీణ్ కుమార్, వాలంటీర్లు పాల్గొన్నారు.

పనులు చేస్తున్న కార్మికులు

సౌకర్యాలు కల్పిస్తే నేరమా?

ప్రజాశక్తి - వేపాడ

మండలంలోని గురుకుల పాఠశాలలో టిడిపి నాయకులు దట్టమైన పిచ్చి మొక్కలను తొలగించి మొక్కలు నాటడమే నేరమా? అని విద్యార్థులు తల్లిదండ్రులు ప్రశ్నిస్తున్నారు. అధికార పార్టీకి చెందిన నాయకులు విద్యార్థుల సమస్యలపై స్పందించకపోయినా టిడిపి నాయకులు గొంప కృష్ణ, గొంప వెంకటరావు మైదానంలో ఉన్న దట్టమైన ముళ్ల పొదలను తొలగించి వాటి స్థానంలో కొబ్బరి, జామ వంటి మొక్కలను నాటుతుంటే వైసిపి నాయకులు పాఠశాల సిబ్బందిని బెదిరించడం సమంజసం కాదని ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. చేతనైతే అభివృద్ధి చేయాలే తప్ప చేసిన వారిని విమర్శించడం బెదిరించడం కరెక్ట్ కాదని మండిపడుతున్నారు.

సచివాలయ సందర్శన

ప్రజాశక్తి - వేపాడ

మండలంలోని జాకేరు సచివాలయాన్ని ఎంపిడిఒ పట్నాయక్ గురువారం సందర్శించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ప్రస్తుతం ప్రభుత్వం ప్రవేశపెట్టిన పథకాలపై ప్రజలకు అవగాహన కల్పించాలన్నారు. అనంతరం రికార్డులను తనిఖీ చేశారు. ఈ కార్యక్రమంలో పంచాయతీ కార్యదర్శి ప్రభుదాసు, గ్రామ వాలంటీర్లు పాల్గొన్నారు.

డిప్యూటీ సిఎం పేదల మనిషి

వైసిపి సర్పంచులు, ఎంపిటిసిలు

సిఐకు ఫిర్యాదు చేస్తున్న వైసిపి సర్పంచులు, ఎంపిటిసిలు

ప్రజాశక్తి-సాలూరు

డిప్యూటీ సిఎం రాజన్నదొర పేదల మనిషి, గిరిజన పక్షపాతి అని వైసిపి సర్పంచులు, ఎంపిటిసి సభ్యులు చెప్పారు. గురువారం డిప్యూటీ సిఎం రాజన్నదొర నివాసంలో పాచిపెంట ఎంపిపి బి.ప్రమీల, సర్పంచులు నూకయ్య, కన్నంనాయుడు మాట్లాడారు. టిడిపి ఎస్టి సెల్ రాష్ట్ర అధ్యక్షులు దారూ నాయక్.. డిప్యూటీ సిఎం రాజన్నదొరపై లేనిపోని ఆరోపణలు చేయడం తగదన్నారు. ఆయన చేసిన ఆరోపణలను నిరూపించాలని, లేకుంటే క్షమాపణ చెప్పాలని డిమాండ్ చేశారు. గిరిజన సంక్షేమం, అభివృద్ధి కోసం రాజన్నదొర ఎంతగానో శ్రమిస్తున్నారని చెప్పారు. నాలుగు సార్లు ఎమ్మెల్యేగా గెలిచిన రాజన్నదొర మచ్చలేని నాయకుడిగా ప్రజల మన్ననలు పొందారని అన్నారు.

రూరల్ సిఐకి ఫిర్యాదు

టిడిపి ఎస్టి సెల్ రాష్ట్ర అధ్యక్షులు దారూ నాయక్‌పై కేసు నమోదు చేయాలని కోరుతూ వైసిపి గిరిజన సర్పంచులు, ఎంపిటిసి సభ్యులు, నాయకులు గురువారం ఫిర్యాదు చేశారు. సిఐ ఎస్.ధనంజయరావుకు ఫిర్యాదు అందజేశారు. తప్పుడు ఆరోపణలు చేసిన దారూ నాయక్‌పై చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు. ఫిర్యాదు చేసిన వారిలో మావుడి సర్పంచ్ పి.సుదర్శనరావు, తుండ సర్పంచ్ నూకయ్య, మరిపిల్లి ఎంపిటిసి సభ్యులు జన్ని సీతారాం, కందులపదం సర్పంచ్ కన్నం నాయుడు, తోణాం సర్పంచ్ మువ్వల ఆదియ్య, వైసిపి నాయకులు ఎస్.కళ్యాణ చక్రవర్తి ఉన్నారు.

మాట్లాడుతున్న టిడిపి పొలిట్‌బ్యూరో సభ్యులు కళా వెంకటరావు

యువగళంపై వైసిపి గూండాల దాడి

టిడిపి పొలిట్‌బ్యూరో సభ్యులు కళా వెంకట్రావు

ప్రజాశక్తి-వీరఘట్టం

నారా లోకేష్ చేపడుతున్న యువగళం పాదయాత్రపై వైసిపి గూండాలు దాడులు చేస్తున్నారని టిడిపి పొలిట్‌బ్యూరో సభ్యులు కిమిడి కళా వెంకట్రావు ఆరోపించారు. గురువారం మండలంలోని కిమ్మి గ్రామంలో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడారు. రానున్న ఎన్నికల్లో వైసిపికి ప్రజలు బుద్ధి చెప్పుతారన్నారు. రాష్ట్రంలో రాక్షస పాలన మొదలై నాలుగేళ్ల నాలుగు నెలలు పూర్తికావస్తుందని, మరో ఆరు నెలలు ఓపిక పడితే జగన్ పీడ రాష్ట్రానికి వీడనుందని చెప్పారు. సమావేశంలో టిడిపి నియోజకవర్గ ఇన్‌ఛార్జి నిమ్మక జయకృష్ణ, మండల అధ్యక్షులు ఉదయాన ఉదయభాస్కర్ , ఎన్.శశికుమార్, సిహెచ్ మహేశ్వరరావు పాల్గొన్నారు.

వ్యాపార దృక్పథం పెరగాలి

ప్రజాశక్తి-భామిని

స్వయం శక్తి సంఘాలకు వ్యాపార ధోరణిని అలవాటు చేసి, సంఘాల ఆదాయం వనరులు సమకూర్చే విధానాలపై విఒఎలు క్షేత్ర స్థాయిలో దృష్టిసారించాలని డిఆర్‌డిఎ పీడీ కిరణ్ కుమార్ తెలిపారు. పాలకొండ నియోజకవర్గంలో తొలగించిన ఓటర్ వివరాలను క్షేత్ర స్థాయిలో గురువారం బాలేరులో పరిశీలించారు. అనంతరం వైకెపి కార్యాలయంలో విఒఎలతో సమీక్షించారు. ప్రజలకు సబ్సిడీతో కూడిన ప్రభుత్వ సంక్షేమ పథకాలు, బ్యాంకు రుణాలపై అవగాహన కలిగించాలని చెప్పారు. ప్రతిఒక్కరూ తీసుకున్న రుణం కట్టాలనే బాధ్యత పెంచాలన్నారు. మండల స్థాయిలో సంఘాల ద్వారా డిపార్ట్‌మెంట్ స్టోర్ ఏర్పాటు చేసి ఆదాయ వనరులు ఎలా పెంచాలో వివరించాలని సూచించారు. వన్‌ధన్ వికాస్ కేంద్రాలు కొన్ని చోట్ల ఫెయిల్ అవ్వటానికి కారణాలు మీకు తెలుసని తెలిపారు. రూరల్ మార్కెటింగ్‌లో భాగంగా 2 లక్షల పైబడి వ్యాపార సంబంధిత రుణాలు మండలంలో 25 వరకు చేయాలని సూచించారు. కార్యక్రమంలో ఎపిడి డి.భవాని పాల్గొన్నారు.

ఓటరు జాబితాను పరిశీలిస్తున్న డిఆర్‌డిఎ పీడీ కిరణ్‌కుమార్

సిటియు శంకుస్థాపనకు అంత ఆర్భాటమేలా?

టిడిపి పొలిట్‌బ్యూరో సభ్యులు సంధ్యారాణి

ప్రజాశక్తి-సాలూరు

విజయనగరం జిల్లాలో ఉన్న గిరిజన యూనివర్సిటీని అదే జిల్లాలో ఏర్పాటు చేయడానికి అంత ఆర్భాటమెందుకని టిడిపి పొలిట్‌బ్యూరో సభ్యురాలు జి.సంధ్యారాణి ప్రశ్నించారు. గురువారం తన నివాసంలో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఆమె మాట్లాడారు. విజయనగరం జిల్లా కొత్తవలసలో వున్న గిరిజన యూనివర్సిటీని అదే జిల్లాలో ఉన్న మెంటాడ, దత్తిరాజేరు మండలాలలో ఏర్పాటు చేసి శంకుస్థాపన చేయడానికి వైసిపి ప్రభుత్వం పెద్ద హంగామా చేసిందన్నారు. కోట్లాది రూపాయల ఖర్చుతో రెండు హెలిప్యాడ్లు నిర్మించి సిఎం జగన్, కేంద్ర మంత్రి ధర్మేంద్ర ప్రధాన్‌తో శంకుస్థాపన చేయడం వల్ల గిరిజనులకు ఒరిగిందేమీ లేదన్నారు. ఆంధ్రా గో బ్యాక్ అన్న కేంద్ర మంత్రి ధర్మేంద్ర ప్రధాన్‌తో కలిసి శంకుస్థాపన చేయడం రాష్ట్రానికి అవమానమేనని చెప్పారు. ఆ విధంగా మాట్లాడిన కేంద్ర మంత్రితో కనీసం క్షమాపణ కూడా చెప్పించలేకపోయారని అన్నారు. గిరిజన సంక్షేమ శాఖ మంత్రిగా రాజన్నదొర ఎన్ని సార్లు ఐటిడిఎ పాలకవర్గ సమావేశాలు నిర్వహించారని ప్రశ్నించారు. సమస్యలేవీ పరిష్కారం కానప్పుడు జగనన్నకు చెపుదాం కార్యక్రమం ఎక్కడ నిర్వహిస్తే ఏం ప్రయోజనం వుంటుందని నిలదీశారు. విద్యా శాఖ మంత్రి బొత్స సత్యనారాయణ, మాజీ ఎమ్‌పి బొత్స ఝాన్సీని తాను విమర్శించినట్లు ఆధారాలుంటే చూపించాలని ఆమె సవాల్ చేశారు. తానెప్పుడూ ఏ నాయకుడిని వ్యక్తిగత విమర్శలు చేయబోనని చెప్పారు. తాను అనని మాటలు అన్నట్టు డిప్యూటీ సిఎం రాజన్నదొర వ్యాఖ్యానించడం ఆశ్చర్యంగా ఉందన్నారు.

వైసిపి నాయకులకు అబద్ధాలు మాట్లాడడం అలవాటయిందని చెప్పారు. మంత్రి బొత్స సత్యనారాయణ, మాజీ ఎమ్‌పి బొత్స ఝాన్సీలు డిప్యూటీ సిఎం రాజన్నదొర, ఆయన అనుచరులను దరిచేరనీయక పోవడం వల్లే వారిని ప్రసన్నం చేసుకోవడానికి ఆ విధంగా మాట్లాడి ఉంటారని సంధ్యారాణి వ్యాఖ్యానించారు. ఈ సమావేశంలో టిడిపి నాయకులు మత్స శ్యామ్, పట్టణ అధ్యక్షుడు నిమ్మాది తిరుపతిరావు పాల్గొన్నారు.

22న ఐటిఐ మిగులు సీట్లకు కౌన్సిలింగ్

ప్రజాశక్తి-సీతంపేట

సీతంపేట ప్రభుత్వ ఐటిఐలో నాలుగో విడత కౌన్సెలింగ్ ఈ నెల 22న నిర్వహిస్తున్నట్లు ప్రిన్సిపల్ ఎం.గోపాలకృష్ణ ఒక ప్రకటనలో తెలిపారు. వెరిఫికేషన్ చేయించుకున్న అభ్యర్థులు కౌన్సిలింగ్‌కి ఒరిజినల్ ధ్రువపత్రాలతో హాజరు కావాలని కోరారు. iti.ap.gov.in వెబ్‌సైట్‌లో 19 తేదిలోగా దరఖాస్తు చేసుకోవాలని తెలిపారు. దరఖాస్తు చేసుకున్న అభ్యర్థులు 20వ తేదిలోగా వెరిఫికేషన్ చేయించుకోవాలని సూచించారు. ఎలక్ట్రీషన్, ఫిట్టర్,చ మోటర్ మెకానిక్, డ్రెస్ మేకింగ్ కోపా, తదితర కోర్సులు అందుబాటులో ఉన్నాయని చెప్పారు. మరిన్ని వివరాలకు 9948582309 నంబర్‌ను సంప్రదించాలని కోరారు.

సాలూరు : స్థానిక ప్రభుత్వ ఐటిఐలో మిగులు సీట్లకు ఈనెల 7 నుంచి 19 వరకు ఆన్‌లైన్‌లో దరఖాస్తు చేసుకోవాలని ప్రిన్సిపల్ వి.రవికుమార్ ఒక ప్రకటనలో తెలిపారు. ఈ నెల 20న ఐటిఐలో ధ్రువపత్రాల పరిశీలన జరుగుతుందని చెప్పారు. 22న కౌన్సిలింగ్ నిర్వహించనున్నట్లు తెలిపారు. ఆసక్తి కలిగిన విద్యార్థులు దరఖాస్తు చేసుకోవాలని కోరారు.

గుమ్మలక్ష్మీపురం : భద్రగిరి ఆర్ఐటిఐలో మిగిలిపోయిన సీట్లకు కౌన్సిలింగ్ కోసం అర్హులైన విద్యార్థుల నుండి దరఖాస్తులు ఆహ్వానిస్తున్నట్లు ప్రిన్సిపల్ సిహెచ్.సునీల్ కుమార్ తెలిపారు. ఈ నెల 19 లోపు దరఖాస్తులను ఆన్‌లైన్లో నమోదు చేసుకోవాలని సూచించారు. 22న అభ్యర్థులకు స్థానిక ఆర్ఐటిఐలో కౌన్సిలింగ్ నిర్వహిస్తామని చెప్పారు.

సుబ్బారెడ్డితో జయమణి భేటీ

ప్రజాశక్తి-సీతానగరం

వైసిపి ఉత్తరాంధ్ర పరిశీలకులు వైవి సుబ్బారెడ్డిని మాజీ ఎమ్మెల్యే సవరపు జయమణి గురువారం భేటీ అయ్యారు. సుబ్బారెడ్డిని మర్యాదపూర్వకంగా కలిసి పలు అంశాలపై చర్చించారు. కార్యక్రమంలో నాయకులు సవరపు రామారావు, మాజీ ఎంపిటిసి చోడవరపు మాధవరావు ఉన్నారు.

సుబ్బారెడ్డికి పుష్పగుచ్ఛం అందిస్తున్న జయమణి

అక్రమ నిర్మాణాలను తొలగించాల్సిందే

ప్రజాశక్తి-పాచిపెంట

పాచిపెంట మండల కేంద్రంలో బిసి కాలనీ వద్ద ప్రభుత్వ స్థలంలో ఎటువంటి అనుమతులు లేకుండా భవన నిర్మాణం చేపట్టారు. దీనిపై స్థానికులు పెద్దఎత్తున అభ్యంతరం తెలిపారు. అక్రమ నిర్మాణాలను తొలగించాలని డిమాండ్ చేశారు. దీంతో స్థానిక రెవెన్యూ అధికారులు, సిబ్బంది అక్రమ నిర్మాణంగా గుర్తించి, గురువారం హెచ్చరిక బోర్డు ఏర్పాటుచేశారు. చట్టరీత్యా నేరంగా పరిగణించి ఆ భవనాన్ని కూల్చివేసేందుకు చట్టపరమైన చర్యలు తీసుకుంటామని అందులో పేర్కొన్నారు.

అక్రమ నిర్మాణం వద్ద ఏర్పాటుచేసిన హెచ్చరిక బోర్డు

రీసర్వేలో జాప్యం వద్దు

కలెక్టర్ నిశాంత్‌కుమార్

ప్రజాశక్తి-పార్వతీపురం

జిల్లాలో రీసర్వే పనుల్లో జాప్యం చేయొద్దని కలెక్టరు నిశాంత్ కుమార్ తెలిపారు. గురువారం సిసిఎల్ఎ స్పెషల్ ఛీఫ్ సెక్రటరీ సిద్ధార్థ్ జైన్ జిల్లా కలెక్టర్లు, జాయింటు కలెక్టర్లతో వీడియో కాన్ఫరెన్స్ ద్వారా రీసర్వేపై సమీక్ష నిర్వహించారు. ఈ కార్యక్రమంలో కలెక్టరు నిశాంత్ కుమార్ మాట్లాడుతూ రీసర్వే పనులు సకాలంలో పూర్తిచేసి, సరిహద్దురాళ్లు ప్లాంటేషన్ చేయడం జరుగుతుందని తెలిపారు. సమీక్షా సమావేశంలో రీసర్వే, తహశీల్దారు లాగిన్లో పెండింగు, అసైన్డ్ భూముల గుర్తింపు, ఫైనల్ ఆర్ఒఆర్, స్టోన్ ప్లాంటేషను తదితర అంశాలపై సమీక్ష నిర్వహించారు. సమావేశంలో జాయింటు కలెక్టరు ఆర్.గోవిందరావు, సర్వే అధికారులు, తదితరులు పాల్గొన్నారు.

మాట్లాడుతున్న కలెక్టర్ నిశాంత్‌కుమార్

హామీని నిలబెట్టుకున్న ముఖ్యమంత్రి

ఎమ్మెల్యే కళావతి

ప్రజాశక్తి-వీరఘట్టం

రాష్ట్ర ప్రజలకు పాదయాత్రలో ఇచ్చిన హామీలను నిలబెట్టుకున్న ఏకైక ముఖ్యమంత్రి వైఎస్ జగన్మోహన్‌రెడ్డి మాత్రమేనని ఎమ్మెల్యే వి.కళావతి అన్నారు. గురువారం మండలంలోని వండువలో ఎమ్మెల్యే క్యాంపు కార్యాలయంలో నూతనంగా మంజూరైన పింఛన్లను ఆమె పంపిణీ చేశారు. కుల, మత, రాజకీయాలకు అతీతంగా అర్హులైన ప్రతిఒక్కరికీ సంక్షేమ పథకాలు పంపిణీ చేస్తున్నట్లు తెలిపారు. అమ్మ ఒడి, విద్యా దీవెన, చేదోడు, కాపు నేస్తం... ఇలా అనేక సంక్షేమ పథకాలు ప్రవేశ పెట్టిన ముఖ్యమంత్రి జగన్ మోహన్ రెడ్డికి ప్రజల ఆశీస్సులు ఎప్పుడూ ఉంటాయన్నారు. కార్యక్రమంలో సర్పంచ్ ఎం.కళ్యాణి, ఎఎంసి ఉపాధ్యక్షులు పి.లక్ష్మణరావు, సచివాలయ సిబ్బంది, వాలంటీర్లు పాల్గొన్నారు.

గరుగుబిల్లి : మండలంలోని పెద్దూరు గ్రామంలో ప్రభుత్వం నూతనంగా మంజూరు చేసిన వైఎస్ఆర్ ఆసరా పింఛన్లను ఉపసర్పంచ్ తెర్లి ఎల్లంనాయుడు గురువారం పంపిణీచేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ పార్టీలకతీతంగా పథకాలను అందించిన ఘనత ముఖ్యమంత్రి జగన్మోహన్ రెడ్డికే దక్కుతుందన్నారు. కార్యక్రమంలో పంచాయతీ కార్యదర్శి బిడ్డిక సుభద్ర, సచివాలయ డిజిటల్ అసిస్టెంట్ ఒట్టికోల లక్షుం పాల్గొన్నారు.



పింఛన్లు పంపిణీ చేస్తున్న ఎమ్మెల్యే కళావతి

కె.వెంకటాపురంలో పొలంబడి

సీతానగరం.. రైతులకు అవగాహన కల్పిస్తున్న ఎఒ అవినాష్

ప్రజాశక్తి-సీతానగరం

మండలంలోని కె.వెంకటాపురంలో వైఎస్ఆర్ పొలంబడి కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా ఎఒ ఎస్.అవినాష్ మాట్లాడుతూ పంట పొలాలలో పక్షి స్థావరాలు ఏర్పాటు చేయాలన్నారు. వాటివల్ల పక్షులు వాలి శత్రు పురుగులను మింగడంతో దిగుబడులు పెరుగుతాయని చెప్పారు. గట్టుమీద బంతి మొక్కలు నాటాలన్నారు. ఇవి శత్రు పురుగుల నివారణకు దోహదపడతాయని రైతులకు సూచించారు.

గుడగుడ్డిలో ప్రకృతిసాగుపై అవగాహన

సీతంపేట : మండలంలోని మర్రిపాడు పంచాయతీ పరిధిలో గుడగుడ్డి గ్రామంలో వెలుగు అసోసియేషన్ ఆధ్వర్యంలో గురువారం ప్రకృతి వ్యవసాయంపై రైతులకు అవగాహన సదస్సు నిర్వహించారు. రిసోర్స్ పర్సన్ పాలక నాగేశ్వరావు మాట్లాడుతూ ప్రకృతి సాగుతో ప్రయోజనాలను రైతులకు వివరించారు. ఈ కార్యక్రమంలో కెఎఫ్‌డబ్ల్యు టీమ్ కేడర్స్ బి.ధర్మారావు, కామేశ్వరావు, వెలుగు అసోసియేషన్ నుంచి రామయ్య, బి.ఆనంద్, ఎసిఒ నాగేశ్వరరావు పాల్గొన్నారు.

పార్టీ బలోపేతానికి కృషి

రిపబ్లిక్ పార్టీ ఆఫ్ ఇండియా అధ్యక్షులు గొర్లె గడ్డెయ్య

ప్రజాశక్తి-సీతంపేట

పార్వతీపురం నియోజకవర్గంలో రిపబ్లిక్ పార్టీ ఆఫ్ ఇండియాని బలోపేతం చేస్తామని ఆ పార్టీ జిల్లా అధ్యక్షులు గొర్లె గడ్డెయ్య అన్నారు. గురువారం స్థానిక విలేకరులతో ఆయన మాట్లాడుతూ అంబేద్కర్ స్థాపించిన పార్టీని బలోపేతం చేయాల్సిన అవసరం ఎంతైనా ఉందన్నారు. రాజ్యాంగాన్ని ఎజెండాగా తీసుకొని నియోజకవర్గ, మండలాల వారీగా నూతన కమిటీలు ఏర్పాటు చేస్తామన్నారు. అంబేద్కర్ వాదులంతా ఏకం కావాల్సిన అవసరం ఎంతైనా ఉందన్నారు. యువత పార్టీలో చేరాలనుకుంటే 9441 868922 నంబరును సంప్రదించాలని కోరారు.

ఘనంగా కృష్ణాష్టమి వేడుకలు

ప్రజాశక్తి-సాలూరు

పట్టణంలోని శ్రీ వెంకట విద్యాగిరి పాఠశాలలో విద్యార్థులు గురువారం కృష్ణాష్టమి వేడుకలు ఘనంగా నిర్వహించారు. పాఠశాల కరస్పాండెంట్ కోడూరు సాయి శ్రీనివాసరావు ఆధ్వర్యాన విద్యార్థులు కృష్ణుడు, గోపిక వేషధారణలతో అలరించారు. అనంతరం ఉట్టి కొట్టే కార్యక్రమంలో విద్యార్థులు ఉత్సాహంగా పాల్గొన్నారు. ఈ కార్యక్రమంలో పాఠశాల హెచ్‌ఎం కోడూరు లక్ష్మి, అకడమిక్ అడ్వయిజర్ జి.మల్లేష్ పాల్గొన్నారు.

డివిఇఒ మంజులవీణను సత్కరిస్తున్న ప్రిన్సిపల్, అధ్యాపకులు

డివిఇఒ మంజులవీణకు సత్కారం

ప్రజాశక్తి -పార్వతీపురంరూరల్

రాష్ట్ర స్థాయి ఉత్తమ అధ్యాపకులుగా అవార్డు అందుకున్న డివిఇఒ డి.మంజులవీణకు గురువారం పార్వతీపురం ప్రభుత్వ జూనియర్ కళాశాల అధ్యాపక, అధ్యాపకేతర సిబ్బంది అభినందనలు తెలియజేశారు. కార్యక్రమంలో ప్రిన్సిపల్ రామారావు, అధ్యాపకులు రాజు, రవికుమార్, శ్రీనివాసరావు, అప్పలనాయుడు, వెంకటేశ్వరరావు, బాబ్జీరావు తదితరులు పాల్గొన్నారు.

కన్నంనాయుడు కుటుంబానికి పరామర్శ

ప్రజాశక్తి-సీతానగరం

మండలంలోని లక్షింపేట గ్రామానికి చెందిన టిడిపి సీనియర్ కార్యకర్త రౌతు కన్నంనాయుడు గురువారం మరణించారు. ఆ కుటుంబాన్ని పార్వతీపురం మాజీ ఎమ్మెల్యే బొబ్బిలి చిరంజీవులు పరామర్శించి ఓదార్చారు. కార్యక్రమంలో మాజీ సర్పంచ్ వంజరపు గుంపుస్వామి, బొమ్మినేని లక్ష్మణరావు పాల్గొన్నారు.